క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

మద్దూరు(హుస్నాబాద్): సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎం హెచ్ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అనంతరం సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, మెడికల్ క్యాంపు నిర్వహణ, జాతీయ, రాష్ట్రీయ ఆరోగ్య కార్యక్రమాలు, రాపిడ్ రెస్పాన్స్ టీంల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాపిడ్ రెస్పాన్స్ టీంలు గ్రామాల్లో జ్వర పీడితుల నుంచి రక్త నమునాలను పరిశీలించి చికిత్స అందించాలన్నారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని, అత్యవసర సమయంలో ఉపయోగించే మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అవసరమున్న గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు.

గ్రామాల్లో మొక్కలు నాటాలి



మొక్కను అందజేస్తున్న సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): వన మహోత్సవం పురస్కరించుకొని గ్రామాల్లో శుక్రవారం పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. నంగునూరు మండల ప్రత్యేక అధికారిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది ఆమెను శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక్కో గ్రామంలో 50, నంగునూరులో 200 మొక్కలు నాటేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు.

హామీలు అమలు చేయాలి

బీజేపీ మహిళా మోర్చా



సిద్దిపేట ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

సిద్దిపేటజోన్: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా నాయకులు గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రతినెలా రూ. 2500, తులం బంగారం, కాలేజీల్లో చదివే యువతులకు స్కూటీ పంపిణీ అమలు కావడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఉమా, జ్యోతి, భాగ్యలక్ష్మీ, నాగజ్యోతి, పద్మ, విజయ, వినోద, మమత, సరిత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ



చెక్కును అందిస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దండు బాలమల్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు రూపంలో మంజూరైంది. గురువారం మృతుడి కుటుంబానికి ప్రతాప్‌రెడ్డి చెక్కు అందజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

గజ్వేల్: గజ్వేల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చాడ రామరాజు పంతులు స్మారకార్థం పట్టణంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. విజేతలకు టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కింద రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.

పొట్లపల్లి ఆలయ అభివృద్ధికి కృషి

● మంత్రి పొన్నం ప్రభాకర్



స్వామి వారికి అభిషేకం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, దశలవారీగా పొట్లపల్లి రాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురియాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని స్వామివారిని వేడుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ రాజన్న తర్వాత పెద్ద శివలింగం కలిగిన పొట్లపల్లిని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిద్దేందుకు తనవంతు కృషి చేస్తాన్నారు. మంత్రికి ఆలయ ఈఓ కిషన్‌రావు స్వామివారి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిత్తారి రవీందర్, కర్ర రవీందర్‌రెడ్డి, కల్లెపల్లి వెంకటస్వామి, దేవసాని నర్సింహారెడ్డి, గాలిపల్లి శ్రీనివాస్, కానుగుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు లక్ష్యంతో పని చేయాలి



బస్టాండ్‌లో ఆర్టీసీ ప్రయోజనాలను వివరిస్తున్న కళాకారులు

హుస్నాబాద్: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆలోచన మేరకు ఉద్యోగులు రూ.లక్షే లక్ష్యంగా పని చేయాలని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. రూ.లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగుల డ్యూటీ విధానంపై గురువారం బస్టాండ్‌లో కళాకారుల బృందం ప్రదర్శన ఇచ్చింది. రోజుకు రూ.లక్ష అదనంగా ఎలా సంపాదించాలో కళాకారులు వివరించారు. కండక్టర్లు, డ్రైవర్లు సమయపాలన పాటించాలన్నారు. ట్రిప్పుల వారీగా ఈపీకే తెచ్చే విధానం, డిపో టీం సహకారంతో లాభాలు సంపాదించవచ్చన్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఫుట్ బోర్డు ప్రయాణం చేయరాదన్నారు. ఆర్టీసీ కల్పించిన రాయితీలు, ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, ప్రైవేట్ వాహన ప్రయాణం నష్టమని వంటి అంశాలపై కళాకారులు పాటల రూపంలో వివరించారు.

ప్రజాసేవకు విరామం ఉండదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ప్రజాసేవకు విరామం ఉండదని, నాయకుడికి పదవుల కన్నా ప్రజాసేవే ముఖ్యమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసిన సందర్భంగా గురువారం భద్రకాళి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): పార్టీలకతీతంగా దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుదామని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పదవీ కాలం పూర్తిచేసిన ఎంపీటీసీల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి దంపతులు, ఎంపీటీసీ సభ్యులను శ్రీనివాస్‌రెడ్డి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీరాంరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు విజయ్‌రెడ్డి, ఎల్లం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్య పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాలకు చెందిన రెడ్డి జేఏసీ నాయకులు ఇటీవల సర్పంచ్, ఎంపీటీసీలుగా పదవీ విరమణ పొందారు. వారిని గురువారం బెజ్జంకిలో రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు స్రవంతి, మహేందర్‌రెడ్డి, పద్మ, కోఆప్షన్ సభ్యులు మహిపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండాల్‌రెడ్డి, సుదాకర్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలను గౌరవించాలి

కొండపాక(గజ్వేల్): ఎంపీటీసీలను ప్రభుత్వం గౌరవించాలని ఎంపీపీ మంచాల అనసూయ, వైస్ ఎంపీపీ దేవి రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో గురువారం కొండపాక ఐటీసీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంపీటీసీలను గ్రామాభివృద్ధిలో భాగస్వాములను చేయాలన్నారు. అభివృద్ధి పనులకు సర్పంచ్‌ల మాదిరిగా ఎంపీటీసీలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంపీటీలకు నిధులు మంజూరు చేయక ఉత్సవ విగ్రహాలుగా చేసిందన్నారు. అనంతరం కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులను సన్మానించారు. అలాగే ఎంపీపీ అనసూయ, కనకరాములు దంపతులను కొండపాక, కుకునూరుపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగరాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు చింతల సాయిబాబా, చిట్యాల హరిత, ఆరుట్ల లక్ష్మి, పత్తి ఆంజనేయులు, బాలాజి, యాదగిరి, నందాల శ్రీనివాస్, భూములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల సేవలు మరువలేనివి

కొమురవెల్లి(సిద్దిపేట): జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల సేవలు మరువలేమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కుమార స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పదవీ కాలం పూర్తయిన ఎంపీపీ తలారి కీర్తన, జెడ్పీటీసీ సిద్దప్ప, ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో మొదటి స్థానంలో ఉండాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: స్వచ్ఛతలో హుస్నాబాద్ పట్టణాన్ని మొదటి స్థానంలో ఉంచేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత కోరారు. పట్టణంలోని 17వ వార్డులో గురువారం చెత్త విభజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడటంతో పర్యావరణానికి హానితో పాటు అనారోగ్యానికి గురవుతామన్నారు.

అల్లూరికి ఘన నివాళి



దుబ్బాకలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాకటౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దుబ్బాక పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మచ్చ శ్రీనివాస్, కాల్వ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బాలామృతం పంపిణీ



పిల్లల ఆరోగ్యంపై సూచనలు చేస్తున్న సీడీపీఓ జయమ్మ

హుస్నాబాద్: పట్టణంలోని 2వ వార్డు అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ జయమ్మ మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న పిల్లలకు బాలామృతం ఇస్తే బరువు పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లల తల్లులు కూడా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోజు రమ, హెల్త్ ఆఫీసర్ తులసీ, అంగన్‌వాడీ టీచర్లు సరిత, స్వరూప, తిరుమల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఏఓ వసంతరావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతు భరోసా పథకంపై గురువారం జగదేవ్‌పూర్ పీఏసీఎస్ కార్యాలయంలో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ వసంతరావు, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసాపై రైతులు వెల్లడించిన అభిప్రాయాలపై నివేదిక రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ నాగభూషణం, సీఈఓ రాములు, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన యువనేత

తొగుట(దుబ్బాక): మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ మండల నాయకుడు, గౌడ సంఘం మండల సోషల్ మీడియా కన్వీనర్ దూలం సతీష్‌గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం చేయాలని సూచించినట్లు తెలిపారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

● ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు



విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటఅర్బన్: ఆరోగ్యవంతమైన జీవనశైలితో పాటు అవగాహన కలిగి ఉంటేనే హెచ్ఐవీ నివారణ సాధ్యమని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు అన్నారు. గురువారం జేఎన్‌టీయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణలో యువత భాగస్వాములు కావాలన్నారు. రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ నరసింహారావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపట్ల వివక్ష చూపకుండా సానుభూతితో వ్యవహరించాలన్నారు. హెచ్ఐవీ నివారణపై పెయింటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ యూత్ కోఆర్డినేటర్ గందె రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామచంద్రం, ఐసీటీసీ కౌన్సిలర్ దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేటఅర్బన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం సిద్దిపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సిద్దన్నపేటలో..

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమురయ్యను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కురుమ సంఘం నంగునూరు మండల అధ్యక్షుడు బెదురు తిరుపతి అన్నారు. గురువారం సిద్దన్నపేటలో దొడ్డి కొమురయ్య 78వ వర్ధతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



గజ్వేల్‌లో మోడల్ స్కూల్‌ను బంద్ చేయిస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బెజ్జంకిలో గురువారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ మండలాల అధ్యక్షులు మహేష్, సాయికృష్ణ మాట్లాడారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: జాతీయ పరీక్షల నిర్వహణలో ఎన్‌టీఏ, విద్యా మంత్రిత్వ శాఖ బాధ్యతారాహిత్యాన్ని నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. పరీక్షల్లో జరిగిన అవకతవకలకు పాల్పడిన ఎన్‌టీఏ అధికారులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కోహెడలో..

కోహెడ(హుస్నాబాద్): నీట్ పేపర్ లీకేజీను నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యసంస్థల బంద్ విజయవంతమైంది. గురువారం విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారం దేశానికే సిగ్గుచేటన్నారు.

ములుగులో..

ములుగు(గజ్వేల్): నీట్ పరీక్ష అవకతవకలను నిరసిస్తూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపు ఇచ్చాయి. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు కళాశాలతోపాటు గ్రామాల్లోని పాఠశాలలను మూసి వేయించారు.

గజ్వేల్‌రూరల్: నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాలు గురువారం గజ్వేల్‌లో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చాయి. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను బంద్ చేయించారు.

ముగిసిన అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష గురువారంతో ముగిసింది. ఆన్‌లైన్ విధానంలో రెండు పేపర్లుగా పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పరీక్షకు 52 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 52 మంది హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, అబ్జర్వర్ వీర్రాజు, టీసీఎస్ ఆఫీసర్ పృథ్వీరాజ్, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ షాదుల్లా తదితరులు పర్యవేక్షించారు.

నేడు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష



కోనేటి వాగు దాటుతున్న తోటపల్లి గ్రామస్తులు (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: నియోజకవర్గ అభివృద్ధిపై సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల అధికారులతో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సమీక్ష నిర్వహించనున్నారు. 2017లో ప్రారంభించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే హుస్నాబాద్ నుంచి అక్కన్నపేట రోడ్డులోని గాంధీనగర్ వరకు నాలుగు వరుసల రోడ్డు చేయాలని, గాంధీనగర్ వంతెన మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కోనేటి వాగుపై వంతెన నిర్మాణ ప్రతిపాదన కాగితల వరకే పరిమితమయ్యాయని, వంతెన నిర్మాణం చేపట్టాలని తోటపల్లి, పూసలపల్లి గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నగదు బహుమతి**

హుస్నాబాద్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు సంగారెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ సావుల నవీన్ చంద్ర నగదు బహుమతి అందజేశారు. గురువారం విద్యార్థులు కె. ప్రణవి, బి.రాకేష్‌లకు రూ.1116 చొప్పున అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి, సువర్ణలీల, వెంకటరమణారెడ్డి, రాజేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నవోదయకు విద్యార్థి ఎంపిక**

నంగునూరు(సిద్దిపేట): నవోదయ ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించిన బూసిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి వర్గల్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడని హెచ్ఎం కత్తుల రామిరెడ్డి గురువారం తెలిపారు. హర్షవర్ధన్ రెడ్డి అంక్షాపూర్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు నిర్వహించిన పరీక్షలో మంచి మార్కులు రావడంతో ప్రవేశ అర్హత సాధించాడన్నారు.

◆ **సమస్యల పరిష్కారంలో విఫలం**

గజ్వేల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్‌వీ నాయకులు విమర్శించారు. గురువారం గజ్వేల్‌లో బీఆర్ఎస్‌వీ పట్టణ ప్రధాన కార్యదర్శి నవాజ్ మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి యువతను మోసం చేసిందన్నారు. ఇప్పటి వరకు డీఎస్సీ వేయలేదని, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచుతామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. విద్యారంగ, నిరుద్యోగ యువత సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు.

◆ **ఉపాధ్యాయులకు సన్మానం**

కొండపాక(గజ్వేల్): పలువురు ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. గురువారం వారిని కొండపాక మండల పరిధిలోని మర్పడగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం భూమయ్య, ఎంపీటీసీ ఆంజనేయులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం విఠల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **బోరు మోటార్ అందజేత**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి గురువారం ఎల్‌టీఆర్ సైన్స్ కంపెనీ ప్రతినిధి తిరుపతిరెడ్డి బోరు మోటారు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారి ఉమామహేశ్వరీ మాట్లాడుతూ బోరు మోటారు కాలిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందని, ఈ విషయాన్ని కంపెనీ వారికి సమాచారం ఇచ్చామన్నారు. వారు స్పందించి బోరు మోటార్ అందజేశారన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6, 7, 8 తరగతులకు ఇంగ్లీష్ బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భారతీదేవి గురువారం తెలిపారు. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులకు సోమవారం డెమో నిర్వహిస్తామని, ఒరిజినల్ పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

◆ **నీట్ పరీక్ష అవకతవకలపై..**

చేర్యాల(సిద్దిపేట): నీట్ పరీక్ష అవకతవకలపై విచారణ జరిపి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ గురువారం పట్టణ కేంద్రంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి యాసీన్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రాహుల్, రాకేష్, మహేష్, శివ, రాకేష్, సాయి, తేజ, వంశీ, అరుణ్, ప్రశాంత్, అభిలాష్, తారక్ పాల్గొన్నారు.

◆ **పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగలపల్లి శివారు పేకాట స్థావరంపై గురువారం టాస్క్‌ఫోర్స్, కోహెడ పోలీసులు దాడిచేశారు. నలుగురుని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.9390 స్వాధీనం చేసుకున్నారు. అలాగే తంగలపల్లిలో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1550లు, ఏడు మొబైల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

◆ **దరఖాస్తు చేసుకోండి**

కొండపాక(గజ్వేల్): ఐటీఐలో చేరేందుకు ఈనెల 4 నుంచి 15 వరకు రెండో విడతలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కుకునూరుపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకట రమణ గురువారం తెలిపారు. గతంలో దరఖాస్తులో చేసుకున్నా ఆప్షన్ మార్చుకొనే అవకాశం ఉందన్నారు. ఫిట్టర్‌లో 15, డీజిల్ మెకానికల్‌లో 37, వెల్డర్‌లో 40 ఖాళీలున్నాయన్నారు. వివరాలకు కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.